సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



అక్షరాలు దిద్దుతున్న చిన్నారి



విద్యాధరి.. అక్షర ఝరి

- వైభవంగా వసంత పంచమి వేడుకలు
- వర్గల్ క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి నామస్మరణతో శంభునిగిరి మారుమోగింది. సోమవారం వసంత పంచమి మహోత్సవం వేళ సరస్వతి అమ్మవారు స్వర్ణ కిరీటంతో దర్శనమిచ్చారు. సరస్వతీదేవి ఆవిర్భావ దినోత్సవం వసంత పంచమి పురస్కరించుకుని అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, లక్ష పుష్పార్చన, పల్లకి సేవ, చెప్పన్‌భోగ్ నివేదనాది కార్యక్రమాలతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి 50వేలకుపైగా భక్తులు సరస్వతి మాతను దర్శించుకున్నారు. దాదాపు 10వేల మంది చిన్నారులు అక్షరాలు దిద్దారు. మహోత్సవ వేడుకల్లో రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపించి మహదాశీర్వచనం పొందారు. సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా రూపుదిద్దుకోవాలని అమ్మవారిని కోరినట్లు, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని మంత్రి పేర్కొన్నారు.

కిక్కిరిసిన క్యూలైన్లు

క్షేత్రానికి భక్తులు భారీగా తరలిరావడంతో తెల్లవారుజామునుంచే క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. విశాలమైన మూడు మండపాలలో అక్షరాభ్యాసాలు కొనసాగాయి.



వర్గల్ క్షేత్రంలో చిన్నారుల అక్షరాభ్యాసాల సందడి, (ఇన్‌సెట్‌లో) స్వర్ణ కిరీటంతో విద్యాధరిమాత దివ్యమంగళరూపం

న్యూస్‌రీల్

8, 9తేదీల్లో జాతీయ సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాస్వామిక రచయిత్రులు

సిద్దిపేటకమాన్: స్థానిక విపంచి కళానిలయంలో ఈ నెల 8, 9వ తేదీల్లో జాతీయ వార్షిక సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ప్రతినిధులు తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 'తెలుగు సాహిత్యం– అంబేడ్కర్ ప్రభావం' అనే అంశం మీద సదస్సు జరుగుతుందని తెలిపారు. సాహితీవేత్తలు, సామాజికవేత్తలు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రజిత, కాత్యాయని విద్మహే, రామలక్ష్మి, శాంతి, ప్రబోధ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధిని గుర్తించడంతో అప్రమత్తంగా ఉంటూ మహిళలు వారి ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి స్వాతిరెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని రాఘవాపూర్‌లో న్యాయ విజ్ఞాన సద స్సు, హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి హాజరై మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే జయించవచ్చన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం బాగుంటుందని, ఎలాంటి చిన్న అసౌకర్యం కలిగినా నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గుట్కా, సిగరెట్లు, తంబాకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, వాటివల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. రా జ్యాంగం కల్పించిన అన్ని రకాల హక్కులను మహిళలు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ రేవతి, ప్రోగాం ఆఫీసర్ నారాయణ, సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వరెడ్డి, మెడికల్ ఆఫీసర్ బాపురెడ్డి, వైద్య సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఆటలపోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కోదాడలో రాష్ట్రస్థాయి ఆటల పోటీలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. ఆసక్తిగల విశ్రాంత ఉద్యోగులు తమ పేర్లను 10వ తేదీలోగా జిల్లా కార్యాలయంలో తెలపాలని, మరిన్ని వివరాలకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు.

సహకారం.. ప్రత్యేకమేనా?

పర్సన్ ఇన్‌చార్జినా?

- 14తో ముగియనున్న సంఘాల పదవీకాలం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 111 సహకార సంఘాలు
- కొత్తగా 53 సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు



దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

సాక్షి, సిద్దిపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలం మరో పది రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌లు, పురపాలికల పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. తాజాగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు సైతం ఆ జాబితాలో చేరనున్నాయి. కొత్త పాలక వర్గాల ఏర్పాటుపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియమిస్తారా? లేక పాత పాలక వర్గానికే పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తారా? అని రైతులు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వారిగానే ప్రస్తుతం డీసీసీబీ కొనసాగుతోంది. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో నూతనంగా డీసీసీబీలను ఏర్పాటు చేస్తారా? లేదా చూడాలి.

111 సంఘాలు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు 111 ఉండగా 2.2లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఈ సంఘాల పాలకవర్గాల పదవీకాలం ఈ నెల 14వ తేదీతో ముగుస్తుంది. సాధారణంగా పాలకవర్గాల పదవీకాలానికి ఆరు నెలల సమయం ఉండగానే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. కానీ ఇప్పటి వరకు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయోనన్న చర్చ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. కొన్నేళ్లుగా కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయలేదు. గతంలో నష్టాల్లో ఉన్న సంఘాలను మరో సంఘంలో విలీనం చేశారే తప్ప కొత్తవి ఏర్పాటు చేయలేదు. పలు పాత, కొత్త మండల కేంద్రాల్లో సైతం సంఘాలు ఏర్పాటు చేయలేదు. ఇటీవల ప్రభుత్వం కొత్త సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు స్వీకరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 53 సంఘాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లాలో సహకార సంఘాలు

జిల్లా పేరు	సంఘాలు
సిద్దిపేట	21
మెదక్	37
సంగారెడ్డి	53

జిల్లాలు ఏర్పడినా.. వికేంద్రీకరణ కాలేదు

కొత్తగా జిల్లాలు ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లు ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి జిల్లా కేంద్రంగానే డీసీసీబీ కొనసాగుతుంది. సిద్దిపేట జిల్లాకు కొత్తగా డీసీసీబీ ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు సంగారెడ్డి కేంద్రంగా కొనసాగుతోంది. అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ(డీసీఎంఎస్)లను సైతం ఏర్పాటు చేయలేదు. సహకార బ్యాంక్‌లలో దీర్ఘకాలిక, పారిశ్రామిక రుణాలు తదితర సమస్యలపై అధికారులను సంప్రదించాలంటే సంగారెడ్డికి వెళ్లాల్సి వస్తోంది. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డికి మరో ఏడాది పదవీకాలం పొడిగించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీకాలం ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. ప్రత్యేక అధికారిని నియమిస్తారా? వారికే పర్సన్ ఇన్‌చార్జి ఇస్తారా అనేది మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొత్త సంఘాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం.

– నాగమణి, జిల్లా సహకార అధికారి

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు షురూ..

- 92శాతం విద్యార్థులు హాజరు
- అధికారుల పర్యవేక్షణ

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఒకేషనల్ విభాగంలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు పరీక్షలు రాశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన పరీక్షలకు 90శాతం హాజరు నమోదు అయింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగిన పరీక్షలకు 94శాతం హాజరు నమోదు అయిందని అధికారులు తెలిపారు. మొదటి రోజు మొత్తంగా 92 శాతం హాజరు నమోదైందన్నారు. కాగా పరీక్షల కమిటీ కన్వీనర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల కేంద్రంతోపాటు పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. హైపవర్ కమిటీ సభ్యులు హిమబిందు, సదానందంలు గజ్వేల్, జగదేవ్‌పూర్‌లోని పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల కమిటీ(డీఈసీ) సభ్యులు జ్యోతి, దేవయ్యలు సిద్దిపేటలోని జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. మొత్తం 24 పరీక్షా కేంద్రాలను అధికారులు సందర్శించి పరిశీలించారు. కాగా సీసీ కెమెరాలు జనరల్‌కు సంబంధించిన ప్రయోగశాలల్లో ఏర్పాటు చేసి, ఒకేషనల్ ప్రయోగశాలల్లో ఏర్పాటు చేయకపోవడంపై పలు అధ్యాపక సంఘాల ప్రతినిధులు ఆరోపించారు.

ప్లాస్టిక్ రహితం.. 21 వెరైటీలతో ఆతిథ్యం





అరటి ఆకులో భోజనం చేస్తున్న అతిథులు, (ఇన్‌సెట్‌లో) గాజుసీసాల్లో తాగునీరు..

- సిద్దిపేటలో వినూత్నంగా వివాహ వేడుక
- అభినందించిన కమిషనర్

సిద్దిపేటకమాన్: వివాహ వేడుకలో ప్లాస్టిక్ రహిత వస్తువులు వినియోగించి, 21 వెరైటీలతో అరటి ఆకులో భోజనం వడ్డించారు. అందరి చేత వివాహ పెద్దలు శభాష్ అనిపించుకున్నారు. పట్టణానికి చెందిన సంగం పద్మ, మధుసూదన్‌రెడ్డి దంపతుల కుమారుడు ప్రేమ్‌చందర్, ఆకాంక్షరెడ్డిల వివాహ వేడుక పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం జరిగింది. పెళ్లి ఆహ్వాన బ్యానర్‌ను పేపర్ ఫ్లెక్సీతో ఏర్పాటు చేశారు. తామర ఆకులో వెజ్ మంచూరియా, మట్టి కప్పులో బాదం మిల్క్, గాజు బాటిల్‌లో తాగునీరు అందించారు. ప్లాస్టిక్ రహితంగా వేడుకను నిర్వహించడంతో పెళ్లికి వచ్చిన అతిథులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సైతం పెళ్లి కుటుంబ సభ్యులను అభినందించారు. ఇదే తరహాలో వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణపై కేంద్రం వివక్ష



సిద్దిపేట అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- బడ్జెట్‌లో తీరని అన్యాయం
- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకుల నిరసన

సిద్దిపేటకమాన్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని, బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్ల కార్డులతో నిరసన తెలిపి, పీఎం మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై సవితి తల్లి ప్రేమ చూపుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

గజ్వేల్: మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడలోని ఎస్‌ఫోర్ రెస్టారెంట్ వద్ద గజ్వేల్ మాజీ సర్పంచ్ కుమారుడు గుంటుకు మహేశ్ తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి నర్సారెడ్డి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీలతోపాటు పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దులు చూపించండి

కలెక్టరేట్ ఏఓకు డీబీఎఫ్ వినతి

సిద్దిపేటరూరల్: దళితులకు పంపిణీ చేసిన భూములకు హద్దులు చూపించాలని డీబీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు డీబీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్‌లు మాట్లాడారు. దుబ్బాక మండలం రాజక్కపేట మదిర గ్రామం ఎల్లాపూర్‌కు చెందిన 12 దళిత కుటుంబాలకు భూమి కొనుగోలు పథకం కింద 2008లో భూ పంపిణీ చేసి పట్టాలు ఇచ్చారన్నారు. కానీ నేటికీ హద్దులు చూపించలేదన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న డీబీఎఫ్ నాయకులు

క్రీడల్లో సత్తాచాటిన పోలీసులకు సీపీ అభినందన



పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: రాష్ట్ర స్థాయి స్పోర్ట్ మీట్‌లో పతకాలు సాధించిన పోలీస్ సిబ్బందిని సీపీ అనురాధ అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని మెడల్స్ సాధించాలని సూచించారు. కరీంనగర్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జోన్ తరపున సిద్దిపేట పోలీసు కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి కరాటేలో ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్ గోల్డ్ మెడల్, పవర్ లిఫ్టింగ్‌లో ఏఆర్ కానిస్టేబుల్ లక్ష్మణ్ సిల్వర్ మెడల్, టెన్నిస్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విష్ణుప్రసాద్, రాజేష్ కాంస్య పతకాలు సాధించినట్లు సీపీ అనురాధ తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, కిరణ్, రాష్ట్ర పోలీసు సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనం.. భక్తజనం



కొండపోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి, బోనాలతో మహిళలు

కొండపోచమ్మ ఉత్సవాలలో భాగంగా మూడోవారం సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. హైదరాబాద్ యాదవసంఘం ఆధ్వర్యంలో బోనం ఘట్టం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని అశ్వవాహనంపై ఊరేగించారు. అమ్మవారి నామస్మరణతో కొండపోచమ్మ ప్రాంగణం మారుమోగింది.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

నులిపురుగులను నిర్మూలిద్దాం

- అందరి సమన్వయంతో సక్సెస్ చేద్దాం
- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 10న నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు 1–2 సంవత్స రాల పిల్లలకు 1/2 టాబ్లెట్, 2–3 సంవత్సరాల పిల్లలకు 1 టాబ్లెట్ పొడిచేసి అందించాలని, 3–19 సంవత్సరాల పిల్లలకు ఒక టాబ్లెట్ చప్పరించేలా ఇవ్వాలని వైద్యాధికారులు తెలిపారు. విద్యాశాఖ అధికారులు మండలస్థాయిలో ఎంఈఓ, హెచ్‌ఎంలకు వివరించి ప్రతి విద్యార్థికి మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అంగన్వాడీ టీచర్లను భాగస్వామ్యం చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారులకు తెలిపారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సైతం ఈ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ట్రస్మా యాజమాన్యాలకు తెలిపారు. జూనియర్ కళాశాలలో సైతం ఈ మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ శాఖ అధికారులకు తెలిపారు. జాతీయ నూలి పరుగుల నివారణ దినోత్సవంపై గ్రామాల్లో చాటింపు చేయించాలని, మున్సిపాలిటీలలో మెప్మా , మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. పిల్లల వ్యక్తిగత పరిశుభ్రతపైనా అవగాహన కల్పించి వ్యాధుల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. అన్ని పాఠశాల యాజమాన్యాలు ముందుగానే వారి తల్లిదండ్రులకు తెలియజేసి శతశాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్, డీడబ్ల్యూఓ లక్ష్మీకాంత్ రెడ్డి, మెప్మా పీడీ హన్మంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



లోకేశ్‌ను సన్మానిస్తున్న తండావాసులు

కౌడిపల్లి(నర్సాపూర్‌): రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గిరిజన విద్యార్థి ఎంపిక అయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని తునికి దేవులతండాకు చెందిన విస్లావత్‌ లోకేష్‌ తునికి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఇటీవల పాపన్నపేటలో జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో సబ్‌ జూనియర్‌ జట్టుకు బెస్ట్‌ రైడర్‌గా లోకేశ్‌ ఎంపిక అయ్యాడు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సోమవారం తండావాసులు రమేశ్‌ నాయక్‌ విద్యార్థికి కబడ్డీ కిట్‌ బహూకరించగా మాజీ సర్పంచ్‌ లక్ష్య నాయక్‌, కోలశ్రీనివాస్‌నాయక్‌, సురేశ్‌ నాయక్‌ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తండానాయకులు చత్రు, రమేశ్‌, జైరామ్‌, పవన్‌, అఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్‌ అసిస్టెంట్‌పై కేసు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఓ ఫీల్డ్‌ అసిస్టెంట్‌పై కేసు నమోదైంది. ఎస్సై విజయ్‌భాస్కర్‌ కథనం మేరకు.. గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవలె ఉపాధి హామీ పనులు చేస్తుండగా బండ రాళ్లు మీద పడి తల్లికూతురు మృతి చెందారు. మరో ఐదుగురు కూలీలకు గాయాలు కాగా ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. విచారణ తర్వాత స్థానిక ఫీల్డ్‌ అసిస్టెంట్‌ వెంకటస్వామి విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించాడని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ను సస్పెండ్‌ చేస్తూ జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు సైతం రానున్నట్లు ఎంపీడీఓ జయరాం, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్‌ తెలిపారు.

ఎండు గంజాయి పట్టివేత



నిందితులతో మాట్లాడుతున్న పోలీసులు

పటాన్‌చెరు టౌన్‌: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్న ఘటన పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్‌ సీఐ పరమేశ్వర్‌ గౌడ్‌ కథనం మేరకు.. ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ ఆదేశాల మేరకు ఎక్సైజ్‌ పోలీసులు పటాన్‌ చెరు పరిధిలోని తుమ్మ చెరువు వద్ద తనిఖీలు నిర్వహించారు. పటాన్‌చెరు ముదిరాజ్‌ బస్తీకి చెందిన నీరుడి సాయికుమార్‌, ఇస్నాపూర్‌ మున్సిపాలిటీకి చెందిన రేణు దేవీ నుంచి 250 గ్రాముల ఎండు గంజాయిని పట్టుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్‌ ఎస్‌ఐ రాములు, సిబ్బంది అఫ్జల్‌, సత్యనారాయణ, నగేశ్‌, గంగ లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

చైన్‌ స్నాచర్‌కు దేహశుద్ధి

జహీరాబాద్‌ టౌన్‌: పట్టపగలే చైన్‌ స్నాచర్‌ మహిళ మెడలో నుంచి నగలు ఎత్తుకెళ్లుతుండగా ఆమె ప్రతిఘటించింది. ఇది గమనించిన స్థానికులు దొంగను పట్టుకొని చితకబాది జహీరాబాద్‌ టౌన్‌ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని పస్తాపూర్‌ ఆర్టీసీ కాలనీలో నవీన్‌ కుటుంబం నివాసం ఉంటుంది. సోమవారం ఉదయం కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్లాడు. తమ్ముడు పని కోసం వెళ్లగా ఇంట్లో భార్య, మరదలు ఇద్దరే ఉన్నారు. మండలంలోని కాశీంపూర్‌కు చెందిన అనంత్‌ రామ్‌ ఇంట్లోకి చొరబడి నవీన్‌ భార్య మెడలో ఉన్న పుస్తెలతాడు బంగారు నగలు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించాడు. వెంటనే స్పందించిన ఆమె ప్రతిఘటించి కేకలు వేసింది. రోడ్డు గుండా వెళ్తున్న ప్రజలు గమనించి చైన్‌ స్నాచర్‌ను పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు జహీరాబాద్‌ టౌన్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో దాడి

మిరుదొడ్డి(దుబ్బాక): భార్యపై భర్త కమ్మకత్తితో దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ మధిర గ్రామం మాదన్నపేటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గండికోట సంతోష, భాస్కర్‌ దంపతులకు 10 ఏళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. జీవనోపాధి కోసం సిద్దిపేటలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో వారం రోజుల కిందట సంతోష పిల్లలతో కలిసి మాదన్న పేటకు వెళ్లింది. భాస్కర్‌ 1వ తేదీన మాదన్నపేటకు వచ్చి కూతురిని ఎవరికీ తెలియకుండా ఎత్తుకెళ్లాడు. సోమవారం మళ్లీ వచ్చి భార్యతో గొడవకు దిగాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడై భార్యపై కమ్మకత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో సంతోషకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహనం ద్వారా సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై భూంపల్లి పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇవేం పంచాయతీలు!

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ప్రభుత్వం

- 15 జీపీలకు సొంత భవనాలు కరువు
- పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లల్లో పనులు నిర్వహణ
- ఇరుకు గదులు, వసతులు లేక ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న సేవాలాల్‌ మహారాజ్‌ తండా గ్రామ పంచాయతీ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): పరిపాలనా సౌలభ్యం కోసం 500 జనాభా కలిగిన ప్రతీ తండాను పంచాయతీగా మార్చిన ప్రభుత్వం పంచాయతీ భవనాల నిర్మాణాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. గ్రామాలను ఏర్పాటు చేసి దాదాపుగా ఏడేళ్లు గడుస్తున్నా సొంత భవనాల నిర్మాణానికి అడుగులు పడలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కమ్యూనిటీ హాళ్లు తదితర వాటిల్లో గ్రామ పంచాయతీ కార్యాలయాలను నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

15 గిరిజన పంచాయతీలు

అక్కన్నపేట మండలంగా ఏర్పడినప్పుడు మొత్తం 32 గ్రామాలు ఉండగా గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన గుడాటిపల్లి గ్రామం ఇటీవల డీ నోటిఫైడ్‌ అయ్యింది. దీంతో 31 గ్రామాలు ఉన్నాయి. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలో వచ్చిన కొద్దిరోజుల్లోనే 500జనాభా కలిగిన 6 గిరిజన తండాలను పంచాయతీగా మార్చింది. అదే విధంగా ఇటీవల హన్మకొండ జిల్లా, వేలేరు మండలంలోని కన్నారం గ్రామాన్ని అక్కన్నపేట మండలంలో విలీనం చేశారు. దీంతో ప్రస్తుతం 38 గ్రామాలుగా ఉన్నాయి. గత ప్రభుత్వంలోనే 9 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు మార్చారు. ఇందులో చౌడుతండా, పంతుల్‌ తండా, దుబ్బతండా, దాస్‌ తండా, చాపగానీతండా, పెద్దతండా, కేశనాయక్‌ తండా, మైసమ్మవాగు తండా, చౌటకుంట తండా, హాతీరాం అంబనాయక్‌తండా, సరిరాంతండా, సేవాలాల్‌ మహారాజ్‌ తండా, కపూర్‌ నాయక్‌ తండా, మసిరెడ్డి తండా, మల్‌చెర్వు తండా గిరిజన గ్రామాలుగా కొనసాగుతున్నాయి.

ఇరుకు గదుల్లో నిర్వహణ

తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా సొంత భవనాలను నిర్మించడం లేదు. 9 గ్రామ పంచాయతీలు ఏర్పడి ఏడేళ్లు దాటినా సొంత భవనాలు లేక అద్దె, ఇరుకు గదుల్లో అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. చాలా వరకు గిరిజన ప్రాంతాల్లో పంచాయతీ కార్యాలయాల్లో అరకొర వసతులతో పాలనను నెట్టుకొస్తున్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇరుకు గదులతో ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఒకే గదిలో కార్యాలయం కొనసాగుతుండటంతో పరిపాలనాపర ఇబ్బందులను అధికారులు ఎదుర్కొంటున్నారు. మరో ఆరు పంచాయతీలు ఇటీవలె ఏర్పడగా వాటి పరిస్థితి అధ్వానంగా ఉంది.

నివేదికలను పంపించాం



మండలంలో 15 గిరిజన పంచాయతీలు ఉండగా చాపగానీతండా, మసిరెడ్డి తండా గ్రామాల్లో జీపీ భవనాలు ఉన్నాయి. మిగిలిన పంచాయతీల్లో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా కట్టడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఇటీవల 6 తండాలు పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం స్థానికంగా అందుబాటులో ఉన్న భవనాల్లో పంచాయతీ కార్యాలయాలను నిర్వహిస్తున్నాం. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం.

– భానోతు జయరాం,
ఎంపీడీఓ అక్కన్నపేట మండలం

యాజమాన్య పద్ధతులతోనే పంట భద్రం

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్‌



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి పంట భద్రంగా ఉండడంతో పాటు, అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం (సంగుపేట) శాస్త్రవేత్త రాహుల్‌ విశ్వకర్మ అన్నారు. సోమవారం ఆయన మరో శాస్త్రవేత్త సరితతో కలిసి మండల పరిధిలోని చండూర్‌ గ్రామంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొలంలో అక్కడక్కడ సల్ఫైడ్‌ దుష్ప్రభావ లక్షణాలు గమనించడం జరిగిందన్నారు. లక్షణాలు ఉన్న పొలంలో అడుగుపెట్టినప్పుడు బుడగల రూపంలో నీరు మారడంతోపాటు, మొక్కను వేర్లతో తీస్తే కుళ్లిన కోడిగుడ్ల వాసన వస్తుందన్నారు. కాంప్లెక్స్‌ ఎరువులు ఎక్కువగా వాడడం ఈ లక్షణాలకు ముఖ్య కారణమన్నారు. సరైన నీటి యాజమాన్యం, మురుగు కాల్వల సౌకర్యాల వల్ల సల్ఫైడ్‌ దుష్ప్రభావాలను తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా లక్షణాలను గమనించిన వెంటనే పంటలోని నీటిని తీసేసి, నేలను గాలి తగిలే విధంగా చూడాలన్నారు. నాటువేసిన పొలాన్ని అప్పుడప్పుడు ఆరబెడుతూ ఉండాలి. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యాన’ అభివృద్ధిపై కీలక తీర్మానాలు



సమావేశంలో పాల్గొన్న నిపుణులు

ములుగు(గజ్వేల్‌): సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉద్యాన అభివృద్ధిపై సోమవారం నిపుణులతో సమావేశం నిర్వహించారు. విశ్వవిద్యాలయ వైస్‌ ఛాన్సలర్‌ డాక్టర్‌. దండా రాజిరెడ్డి నేతృత్వంలో కొనసాగిన సమావేశంలో తెలంగాణలో ఉద్యాన సుస్థిర అభివృద్ధి, ఉద్యాన విశ్వవిద్యాలయానికి భవిష్యత్‌ రోడ్‌ మ్యాప్‌ కోసం సమగ్ర నివేదిక, విజన్‌ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఉద్యాన రంగంలో సవాళ్లు, అవకాశాలను పరిష్కరించడానికి పరిశోధన, విద్య, విస్తరణ సేవలను పెంపొందించడంపై చర్చించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న వ్యవసాయ పద్ధతులపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలో ఉద్యాన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి విలువల జోడింపు, మార్కెట్‌ లింకేజీలు, విధాన నిర్ణయాలు, భవిష్యత్‌ కార్యక్రమాలను మార్గనిర్దేశం చేయడానికి సమగ్ర నివేదిక రూపొందించనున్న కీలక సిఫార్సులపై ఏకాభిప్రాయంతో నిపుణుల బృందం తీర్మానించింది. కార్యక్రమంలో మాజీ వైస్‌ ఛాన్సలర్‌లు, విశ్వవిద్యాలయ మాజీ అధికారులు, సాంకేతిక సలహాదారులు, వివిధ కళాశాలల అసోసియేట్‌ డీన్లు, రీసెర్చ్‌ స్టేషన్ల అధిపతులు, పాలిటెక్నిక్‌ కళాశాలల ప్రిన్సిపాల్‌లు, ప్రోగ్రామ్‌ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా



మెడల్స్‌తో దుబ్బాక విద్యార్థులు

10 గోల్డ్‌ మెడల్స్‌, 9 సిల్వర్‌ మెడల్స్‌ సాధించిన దుబ్బాక విద్యార్థులు

దుబ్బాక: వరల్డ్‌ నకాయమా షోటోకాన్‌ కరాటే అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌ రెడ్డి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆల్‌స్టైల్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ కరాటే ఛాంపియన్‌ షిప్‌లో దుబ్బాక విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 3 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. దుబ్బాక విద్యార్థులు 10 గోల్డ్‌ మెడల్స్‌, 9 సిల్వర్‌ మెడల్స్‌, ఒక బ్రౌన్‌ మెడల్‌ సాధించడం విశేషం. దుబ్బాక మున్సిపల్‌ లచ్చపేట మోడల్‌ స్కూల్‌ ఐశ్వర్య, సిరివెన్నెల, జ్ఞాన శ్రీ, శృతి, రుచిత గోల్డ్‌ మెడల్స్‌, సౌమ్య, శ్రీనిత్య, విహాన్‌ సిల్వర్‌ మెడల్స్‌, మిరుదొడ్డి మోడల్‌ స్కూల్‌కు చెందిన హర్షిత గోల్డ్‌ మెడల్‌, దుబ్బాక ఎంపీపీ స్కూల్‌ విద్యార్థిని అక్షిత, భవ్యశ్రీ గోల్డ్‌ మెడల్స్‌, అక్షయ, చరణ్‌ సిల్వర్‌ మెడల్స్‌, సరస్వతీ గ్లోబల్‌ స్కూల్‌కు చెందిన అర్చన గోల్డ్‌ మెడల్‌, చైతన్య సిల్వర్‌ మెడల్‌ సాధించారు. జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు చెందిన మనోజ్‌ తేజ సిల్వర్‌ మెడల్‌, గాయత్రీ వివేకానంద విద్యాలయంకు చెందిన నిశాల్‌ సిల్వర్‌ మెడల్‌, మాస్టర్‌ మైండ్స్‌ స్కూల్‌కు చెందిన హర్షవర్ధన్‌ గోల్డ్‌ మెడల్‌, రుషి విద్యాలయం విద్యార్థి శ్రేయాన్స్‌ బ్రౌన్‌ మెడల్‌ సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్‌ బురానీ శ్రీకాంత్‌ను ఛాంపియన్‌ షిప్‌ కప్‌తో అభినందించారు.

ఇద్దరు అదృశ్యం



ఆనంద్‌

పటాన్‌చెరు టౌన్‌: ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన ఆనంద్‌ గత నెల 24న పని నిమితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా అదేనెల 31న మాట్లాడాడు. తిరిగి మరుసటి రోజు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ వచ్చింది. కుటుంబ సభ్యులు ఆనంద్‌ కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్టాండ్‌ నుంచి వెళ్లి మహిళ..



రేణుక

మహిళ అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రామచంద్రపురం ఎస్‌ఎన్‌ కాలనీకి చెందిన అశోక్‌ లేబర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం భార్య రేణుక, కూతురు బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పడంతో పటాన్‌ చెరు బస్టాండ్‌తో దింపడానికి వచ్చాడు. బస్టాండ్‌లో కూతురిని వాష్‌రూమ్‌కు తీసుకెళ్లి తిరిగొచ్చే సరికి రేణుక కనిపించలేదు. వెంటనే చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గతంలో ఇలాగే ఓ వ్యక్తితో ఆరు నెలలు ముందు వెళ్లిందని, ఇప్పుడు కూడా అతడితో వెళ్లి ఉండవచ్చని అతని పై అనుమానం ఉందని అశోక్‌ పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సేవా మార్గాలకు నిలయంగా కొండపాక

సినీ నటుడు సుమన్‌



మెమొంటోలను అందజేస్తున్న సుమన్‌

కొండపాక(గజ్వేల్‌): సేవా మార్గాలకు కొండపాక నిలయంగా మారుతుందని ప్రముఖ సినీ నటుడు సుమన్‌ కొనియాడారు. కొండపాక శివారులో గల ఆనంద నిలయం సమీపంలో ఏర్పాటైన సత్య సాయి సంజీవనీ సెంటర్‌ ఫర్‌ హార్ట్‌ కేర్‌ రిసెర్చ్‌ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 10 ఏళ్లలోపు పిల్లలకు జరుగుతున్న హార్ట్‌ ఆపరేషన్ల తీరులను, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవలె నలుగురు పిల్లలకు చేసిన ఆపరేషన్ల విషయమై తల్లిదండ్రులకు మెమొంటోలను అందజేశారు. ఈ సందర్భంగా సుమన్‌ మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలు మహోన్నతమైనవని అన్నారు. సత్యసాయి హార్ట్‌ కేర్‌ సెంటర్‌ పసి హృదయాల జీవితాలకు సంజీవనిగా నిలుస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా సత్యసాయి ఆస్పత్రుల్లో సుమారు 34 వేల మంది పసి హృదయాల గుండెలకు శస్త్ర చికిత్సలను వైద్యులు విజయవంతంగా పూర్తి చేయడంపై వైద్యలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్‌ శ్రీనివాస్‌, రిటైర్డు ఐఏఎస్‌ చక్రపాణి, వైద్యురాలు రాగిణి, తదితరులు పాల్గొన్నారు.

అడవి పందిని తప్పించబోయి..

రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్యే గన్‌మెన్‌ మృతి



శ్రీనివాస్‌ (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: బైక్‌పై నుంచి పడి తీవ్రగాయాలతో ఎమ్మెల్యే గన్‌మెన్‌ మృతి చెందిన ఘటన బీడీఎల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ స్వామిగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం బుల్కాపూర్‌ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ 2018లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరాడు. ప్రస్తుతం వికారాబాద్‌లో ఏఆర్‌ కానిస్టేబుల్‌గా ఉన్న అతడు చేవెళ్ల ఎమ్మెల్యే వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం విధులు ముగించుకొని వెలిమలలో ఉండే మామ ఇంటికి రాత్రి బయలు దేరాడు. రామచంద్రపురం పరిధిలోని వెలిమల తండా గ్రామ శివారు వద్దకు రాగానే ఓ అడవి పంది శ్రీనివాస్‌ బైక్‌కు అడ్డు రాగా తప్పించబోయి అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

10 మందికి గాయాలు



గొడవపడుతున్న ఇరువర్గాలు

నారాయణఖేడ్‌: ఇరు వర్గాలకు చెందిన వారు పరస్పరం దాడులకు పాల్పడగా 10 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బాణాపూర్‌ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాణాపూర్‌ గ్రామం పక్కనే బుడగ జంగాల కాలనీ ఉంది. శుక్రవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌ను నడుపుతూ వెనక్కి తీస్తున్న క్రమంలో కాలనీ సమీపంలోని ఓ విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టడంతో విరిగిపోయింది. దీంతో కరెంట్‌ సరఫరా నిలిచిపోయింది. శనివారం మరో స్తంభం ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా కాలనీకి చెందిన ఓ వ్యక్తికి తాకింది. దీంతో చిన్నపాటి గొడవ జరిగింది. సోమవారం గ్రామ సమీపంలో యువకులు క్రికెట్‌ ఆడుతుండగా స్తంభం తాకిన వ్యక్తి కావాలనే తగిలించావని ట్రాక్టర్‌ డ్రైవర్‌తో గొడవపడ్డాడు. విషయం తెలుసుకొని బుడగ జంగాల కాలనీ వారు, గ్రామానికి చెందిన వారు అక్కడకు చేరుకొని ఘర్షణ పడ్డారు. రాళ్లు, కర్రలతో కొట్టుకున్నారు. బుడగ జంగాల కాలనీకి చెందిన కె.శ్రీను, శేఖర్‌, శ్రీనుతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బీరప్ప, వంశీ, కృష్ణ, దుర్గయ్య తోపాటు మరొకరు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడ్డవారిని ఖేడ్‌ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరస్పరం ఫిర్యాదులు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కల్వర్టును ఢీకొన్న ఆటో : డ్రైవర్‌ మృతి



ప్రేమ్‌సింగ్‌ (ఫైల్‌)

జహీరాబాద్‌ టౌన్‌: ఆటో అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో డ్రైవర్‌ మృతి చెందాడు. భార్యకు స్వల్పగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మొగుడంపల్లి మండలం సున్నబట్టి తండాకు చెందర్‌ బాణోత్‌ చందర్‌ పూజారి కుమారుడు బాణోత్‌ ప్రేమ్‌సింగ్‌(32) ఆటోను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మండలంలోని రాయిపల్లి తండాలో ఉన్న అత్తగారికి ఆరోగ్యం బాగలేకపోవడంతో చూసేందుకు భార్యాపిల్లలతో కలిసి ఆదివారం ఆటోలో వెళ్లాడు. రాత్రి వరకు అక్కడే ఉండి తిరిగి సున్నంబట్టి తండాకు వెళ్తున్నాడు. మార్గ మధ్యలో ఆటో అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రేమ్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. భార్యకు స్వల్ప గాయాలు కాగా ముగ్గురు పిల్లలకు ఏమీ కాలేదు. చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్‌: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్‌కు చెందిన వడ్డే సాయిలు బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్‌ మున్సిపాలిటీలో పరిధిలో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. కుమారుడు వడ్డే మహేశ్‌(24) గాలి గూడెం గ్రామానికి చెందిన మౌనికతో మూడు నెలల కిందట జరిగింది. ఆదివారం ఇంటి పక్కన ఉండే జానకి రాజుతో కలిసి తెల్లాపూర్‌లో పుట్టిన రోజు వేడుకకు హాజరై రాత్రి ఇంటికి తిరిగొచ్చాడు. మహేశ్‌ కుటుంబ సభ్యులు హాల్‌లో ఉండగా బెడ్‌ రూమ్‌ లోకి వెళ్లి డోర్‌ వేసుకున్నాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు తలుపు కొట్టగా తీయలేదు. అనుమానంతో కిటికీ లోంచి చూడగా ఫ్యానుకు ఉరేసుకొని కనిపించాడు. కిందికి దింపి రామచంద్రపురం పరిధిలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి తండ్రి సాయిలు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్స్‌ బస్సు బోల్తా: ఏడుగురికి గాయాలు

- నిద్రమత్తులో నడిపిన డ్రైవర్‌
- కమలాపూర్‌ శివారులో ఘటన



బోల్తాపడిన మినీ ట్రావెల్స్‌ బస్సు

పెద్దశంకరంపేట(మెదక్‌): డ్రైవర్‌ నిద్రమత్తులో వాహనాన్ని నడపడంతో అదుపుతప్పి మినీ ట్రావెల్‌ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి గాయాలైన ఘటన పెద్దశంకరంపేట మండలం కమలాపూర్‌ శివారులో 161వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో మినీ ట్రావెల్స్‌ బస్సు 17 మంది ప్రయాణికులతో కర్నూల్‌ నుంచి నాందేడ్‌ వైపు వెళ్తుంది. డ్రైవర్‌ నిద్రమత్తులో ఉండటంతో కమలాపూర్‌ శివారులో బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గాయత్రి(37), ధనుష(7), జయశ్రీ(50), సంజుకుమార్‌(57), పరమదాహూర్‌(55), డ్రైవర్‌ సోపాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదానికి డ్రైవర్‌ నిద్రమత్తే కారణమని భావిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని యజమాని సంబాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.శంకర్‌ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన అడవి పంది

నిజాంపేట(మెదక్‌): బైక్‌ను అడవి పంది ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని నందిగామ గ్రామశివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేటకు చెందిన మద్దురి మహేశ్‌ నిజాంపేట నుంచి రామాయంపేటకు వెళ్తుండగా అడవి పంది ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీకి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

దుబ్బాకరూరల్‌: డివైడర్‌ను బైక్‌ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని చీకోడ్‌ గ్రామంలో జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబర్‌పేటకు చెందిన చంద్రశేఖర్‌ పని నిమిత్తం బైక్‌పై దుబ్బాకకు వచ్చాడు. పని పూర్తి చేసుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా చీకోడ్‌ గ్రామం వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలు కావడంతో అంబులెన్సులో దుబ్బాక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



గాయాలతో చంద్రశేఖర్‌

కారు చెట్టును ఢీకొట్టడంతో..

గజ్వేల్‌రూరల్‌: చెట్టును కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన నాయిని స్వామి సోమవారం కారులో గజ్వేల్‌ నుంచి హైద్రాబాద్‌కు వెళ్తున్నాడు. మార్గమధ్యలో లింగరాజ్‌పేట్‌ సమీపంలో ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామికి గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు క్షతగాత్రుడి బంధువులు పేర్కొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ.. రోడ్డు ప్రమాదానికి గురి

కొండపాక(గజ్వేల్‌): బోరు బండి, కారు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని వెలికట్ట గ్రామ శివారులో సోమవారం చోటు చేసకుంది. వివరాల్లోకి వెళ్తే.. మిరుదొడ్డి మండలంలోని వీరారెడ్డిపల్లికి చెందిన దంపతులు లింగాల వెంకట్‌రెడ్డి, పద్మలతోపాటు అత్తమ్మ రాజవ్వ, బామ్మరిది తిరుపతిరెడ్డి కలిసి కారులో చేర్యాల మండలంలోని తాడూర్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తున్నారు. చేర్యాల నుంచి అంకిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్తున్న బోరు బండి అకస్మాతుగా టర్న్‌ అవుతుండగా కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరుగగానే కారు బెలూన్స్‌ తెరచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.



దెబ్బతిన్న కారు